# బూర్జువా కుక్క

నేను రోడ్డంటే పోతున్నాను. నాపక్కగా కారొచ్చి నిలబడ్డాది. కారులో ఆసామీ 'హల్లో' అంటే 'హల్లో' అన్నాను.

కారులో ఆసామీ సామాన్యుడు కాడు. బాగా చదువుకొన్నవాడనీ, ఉన్నతాశయాలు కలవాడనీ, ముఖ్యంగా పెద్ద స్థితిపరుడనీ ప్రతీతి. నాకు చిన్నప్పుడు బాగా స్నేహితుడు. పెద్దయినతరువాత జీవితాలలో బాటలు వేరు వేరు అయిపోయాయి.

'నాతో నువ్వు రావాలి' అన్నాడు.

దానికేం భాగ్యం? కారులో కెక్కించుకొని క్లబ్బుకి మోసుకుపోయి అక్కడ చిన్న ఫలహారం తగిలిస్తూ, మామూలు మాటలైనాక అతనో విశేషం చెప్పేడు.

'ఈమధ్య నీకథలు కొన్ని చదివేను. కథలు నన్ను కొసదాకా తీసుకెళ్ళనూ తీసుకెళ్ళాయి. నేను చద[illegible] చదివాను. కథలో శిల్పం ఉంది. నేను సర్టిఫికేట్ ఇస్తున్నాను. గోడకి తగిలించుకో' అన్నాడు.

'గోడకేం? మెడకే తగిలించుకోవాలి' అన్నాను.

'అదే చెయ్యవలసింది. నావంటి కల్చర్డు జెంటిల్మన్ ఇచ్చిన తాఖీదు సామాన్యమైనది కాదు. నువ్వు నాకు చాలా కృతజ్ఞత చూపవలసివుంది కథలు చదివినందుకు. తరువాత నాకు కలిగిన భావాల మూలంగా నువ్వు కనబడగానే తన్ననందుకు!'

'కథలు ఆగ్రహానికి కారణమయాయా?'

'వొళ్ళు మండుకొచ్చింది. ఆ రాతలు నాకు తలనొప్పి. చిన్నప్పుడు నీకెన్నో మధురభావాలుండేవి. ఏమైనాయి? మధురస్వప్నశాఖగా విస్తరించవలసిన నీ సాహితి తుమ్మకొయ్యగా చిగుళ్ళు పెడుతున్నది. నీలో రొమాన్సు చచ్చింది.'

'రొమాన్సు కర్థం తెలుసా?'

'సరి ! ఆంగ్లపదవిన్యాసం ఫొలరుదొర మన దగ్గర నేర్చుకోవాలి. నువ్వంతా పెడమార్గాన్ని పోతున్నావు. చిన్నసలహా ఇస్తాను.'

'బాలాదపి సుభాషితమ్!'

'అప్రాచ్యుడా! నన్ను కుఱ్ఱవెధవని చేస్తావ్!'

'అని ఎక్కడన్నాను?'

'ధ్వనించేవు. ఆల్ రైట్. ఈమధ్య నీ కథలు కొన్ని చదవవలసి వొచ్చింది.'

'చిక్కే!'

'చిక్కేపడ్డాను. అవి నన్ను లాక్కుపోయాయి. దాంతో మరీ రిమ్మెత్తు కొచ్చింది. వాస్తవం చెపుతున్నాను. కొన్నికథలు చదివితే ఏడు పొచ్చింది. అనవసరంగా నీమూలాన్ని మనస్సు పాడైంది. కథావస్తువుని బాగానే పని చేస్తావు. కాని చెప్పేనుగా పెడమార్గంపట్టేవు. కథల్లో ముఖ్యంగా నాకు నచ్చింది నువ్వు సృష్టించే వాతావరణం. నాకు చిన్న ఉపకారం చెయ్యాలి. చేస్తావా?'

'చెప్పూ.'

'నాకో కథ రాసి పెట్టాలి. జరిగిన విషయమే. నువ్వయితే అందంగా చెపుతావు.'

'చెప్పూ.'

'మరేం లేదూ. గత సంవత్సరం 'లూసీ' అన్న తెల్లపిల్లని వెంట పెట్టుకుని ఊటీ వెళ్ళేను. నెల్లాళ్ల దాన్ని నేను భరించటానికీ, అది భరించబడడానికీ ఏర్పాటు.'

'భార్యా భర్తలుగా నెల్లాళ్లు కాలక్షేపం చెయ్యడానికి.'

'సరిగ్గా చెప్పేవు. డబ్బు మనకి బాగా వొదిలిపోయిందనుకో. అయితేనేం ఊటీకొండలకి మేఘా లెంతందమో ఊటీ బంగాళాలకి లూసీ అంతందము. లూసీ తనతో 'బొర్జువా' (Borzoi) కుక్కనొకటి వెంట పెట్టుకొచ్చింది.'

'బూర్జువా కుక్కేమిటి?'

'నీకు కుక్కలజాతులు తెలియవు. ఒక్కినాటు వెధవ్వి! ఎలాగ తెలుస్తుందిలే! బూర్జువాకాదు, బొర్జువా, అదొక ఐరోపాజాతి కుక్క!'

'బూర్జువా దొరసానిగారి బొర్జువా కుక్క!'

'బాగానే అన్నావు. దానికేం, ఉంపుడుకత్తెమీద మనకెంత మమకారమో పెంపుడు కుక్కమీద లూసీ కంత మమకారం. నాలుగు రోజులు ఊటీని 'బ్యూటీ' అన్నాము. బొర్జువా కుక్కకూడా మాతోపాటు ఊటీని ఆనందిస్తున్నది. దానికికూడా కావలసిన సొసైటీ, రొమాన్సు ఉన్నాయి. ఒకనాడు ఏ పాము కరిచిందో బొర్జువా చచ్చి పడివుంది!'

'లూసీకి చాలా పెద్దదెబ్బే!'

'హృదయానికి పెద్ద గాయం తగిలినట్టు ఏడుపులు మొదలెట్టింది.'

'పాపం!'

'ఆఁ పాపం ! దీనేడుపు వినడానికి తీసికెళ్ళానా ?'

'ఏం చేశావు?'

"ఇంకొక బొర్జువాని దాని తాతలాంటిదాన్ని కొనిస్తాను. కుక్క కోసం ఏడుపేమిటి? అన్నాను. విరహతాపంలాగ పట్టుకొంది. అంత మమకారమేమిటి? కుక్కపోతే కుక్క రాదూ? నేను చెప్పేశాను. నా ఎదుట ఏడుపులు పనికిరావు. లేకపోతే వచ్చినతోవనే నడువు అన్నాను."

'డబ్బు ఖాయ్! విస్కీవైనులతో నాదగ్గర విచారాన్ని దిగమింగి దానిఖర్మానది ఒంటరిగా ఉన్నప్పుడు కుక్కకోస మేడ్చేది. నాకేం ? నేను హాయిగా పావురాయిపక్షాలమీద ఊటీ విహాయసమంతా వలయగమనాలతో కాలం ఎగరనిచ్చేను.

'ఊటీ నాకు కామెడీ. లూసీకి ట్రాజడీ, ఇదీ కథ. దీన్ని నువ్వు ఎలాగ రాస్తావో రసవంతంగా ఉండాలి.'

'తప్పకుండా రాస్తాను.'

'రాస్తావ్?'

'ఊఁ'

'నువ్వు రాయవు.'

నేను రాస్తానన్నా నమ్మలేకపోతున్నాడు ! నా కథల మూలంగా నా మతం కొంత బోధపడి ఉంటుంది. అందుచేత రాయనని అనుమాన పడుతున్నాడు. బాగా చిన్నప్పటి స్నేహితుడు. సాహిత్యాన్ని బాగా తర చినవాడు. కొన్ని గ్రంథాలకి కృతిపతి, కొన్ని ప్రచురణలకి రాజపోష కుడు, నాకు పెద్ద ఉపన్యాసమిచ్చేడు!

'ఈ మధ్యని కొంతరు దరిద్రసంగీతం ప్రారంభించారు. దరిద్ర సంగీతానికి ఆకాశం, భూమి తాళం చిప్పలు చేసి సాహిత్యాన్ని దగ్ధం జేస్తున్నారు. వీరశైవులమని బురఖా తొడుక్కొని సాంఘికవాదం ప్రచారం చేస్తున్నారు. మహేశ్వరాస్థానంలో ఐశ్వర్యం బుగ్గి, బూడిదా! అక్కడ పుట్టిలో భిక్షని ఏమి జుట్టుకోగలం?

'మనచుట్టూ ఏముంది? దరిద్రం, దుఃఖము ఉన్నాయి. దానికి మనమా బాధ్యులం ? అది వాళ్ళవాళ్ళ కర్మ. ఎక్కువతక్కువలకి అదే కారణం. పూర్వజన్మ, పునర్జన్మ నేను నమ్ముతాను. ఆర్యులు చెప్పినది మహా సత్యము, ప్రజాస్వామ్య సాంఘికవాదాలన్నీ బుద్బుదాలు.

'మనకేం? మనం పెళ్ళికొడుకులం. పట్టుపరుపు, ద్రాక్షసారా ఎదు రుగా వున్నాయి. మన 'భార్య' ఎప్పుడూ తరుణి. రూపవతి, ఇది మన మన పుణ్యం. చుట్టూ అలో లక్షణా అని లక్షమంది ఏడుస్తూ ఉండొచ్చు. అది వాళ్ళవాళ్ళ కర్మ. మనకేం?'

'నువ్వు నాకు బాగా స్నేహితుడివి. చెడడానికి సిద్ధంగా వున్నావు. అప్పుడే సాహిత్యాన్ని దరిద్రులపాలు చేస్తున్నావు. ఇహ నది కట్టిపెట్టు.

'కవి ఎలాగుండాలి? పాదుషాలా గుండొద్దూ? కప్పురపువిడెం అందివ్వవలసింది అందివ్వద్దూ? కవిత్వం ఎలాగుండాలి? ఫ్రెంచి వైను లాగ, రంగు, రింగు, గింగురూ ఉండొద్దూ?'

'అవన్నీ ఉండేటట్టు నాకథ రాయి. ఏమంటావు?' అన్నాడు.

నేను విపరీతమైన నవ్వు నవ్వేను. అతను చెప్పినదానికంతకీ ఆ నవ్వే జవాబు ! ఆ నవ్వుకి నాలుగువేల అంచులున్నాయి. ఇప్పుడు తిరిగి అలాగ నవ్వమంటే నా తరంకాదు. విని విని విన్నదానికి జవాబుగా అప్ర యత్నంగా ఆ నవ్వు అతనిమీద నయాగరాలాగ విరుచుకుపడ్డాది.

అతని జీవితంమీద, జీవితాశయాలమీద, నమ్మకాలమీద నాకు కలిగిన జుగుప్స, హేళన, ఆగ్రహము, తిరస్కారము—నాలో రేగిన లక్ష భావాలు ఆ వొక్కనవ్వులో వ్యక్తమైనాయి! భాషలో పదజాలానికి అతీతమైన ప్రతిభతో అనేక భావాలని సూక్ష్మంగా ఆ నవ్వు వ్యక్తపర్చింది.

అతను బాగా నొచ్చుకున్నాడు. సాహితీపరులంతా అతని చుట్టూ పరిభ్రమిస్తూ భజన చేస్తూ ఉంటారు. నా తిరస్కారాన్ని సహించగలడా?

'మీరంతా సాహిత్యానికి చీడపురుగులు. నీకు సరియైన మార్గం చెప్పేను. నీలో మారే స్వభావంలేదు. మారకపోతే మనిషికాడు. నేను చెప్పిన కథ నువ్వెక్కడ రాస్తావు? నిన్ను చూసి విచారించవలసి ఉంది. విచారించడం నా స్వభావం కాదు.'

అని అంత్యోపన్యాస మిచ్చి, నెత్తిమీద హేటు బోర్లించుకుని, బిల్లు తనే ఇచ్చేసి, నా మొహమైనా మరి చూడకుండా, కారులో దూరి స్టార్టు చేసుకుపోయాడు.

బోర్జువాకుక్క కథ నేను రాయననుకున్నాడు. అక్కడ నా నవ్వు పొరపాటు అభిప్రాయం అతనిలో కలిగించింది. కథ నేను రాశాను. ఆ వర్గ జీవితాన్ని దులపవలసిన రీతిగా దులిపిదులిపి రాశాను. రాస్తున్నంత సేపూ నా చుట్టూ ఆనందం గువ్వపిట్టలాగ గుబాళించింది.